సాక్షి వికారాబాద్

మంగళవారం । 12 । నవంబర్ । 2024



క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. 8లో▸



తేలికపాటి నేలలే అనుకూలం

పత్తి సాగుకు తేలికపాటి నేలలే అనుకూలమని ప్రధాన శాస్త్రవేత డాక్టర్ సుధారాణి అన్నారు. 8లో▸



అందని ద్రాక్షలా..

ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య అందని ద్రాక్షలా మారింది. చాలా స్కూళ్లలో కంప్యూటర్లు నిరుపయోగంగా ఉన్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

పాటల పోటీల్లో సత్తాచాటిన మణికుమార్



ప్రథమ బహుమతి అందుకుంటున్న మణికుమార్

కుల్కచర్ల: స్టార్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో కుల్కచర్ల మండలం కామునిపల్లికి చెందిన మణికుమార్(4వ తరగతి) మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన మణికుమార్‌ను పాఠశాల సిబ్బంది, స్థానిక నాయకులు అభినందించారు.

చిత్రలేఖనం పోటీలో..



బహుమతి స్వీకరిస్తున్న విద్యార్థి అశ్విత

పరిగి: వరంగల్‌లో ఈ నెల 10న నిర్వహించిన బాలోత్సవం పోటీల్లో పరిగి విద్యార్థులు సత్తాచాటారు. పట్టణంలోని సుదీక్ష పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి మణికుమార్ పాటల పోటీల్లో, 7వ తరగతి విద్యార్థి అశ్విత చిత్రలేఖనం పోటీలో పాల్గొని ప్రథమ బహుమతులు పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు వేల మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనగా పరిగికి చెందిన విద్యార్థులు విజేతలుగా నిలవడం సంతోషంగా ఉందని పాఠశాల డైరెక్టర్ వీరేష్, ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ అన్నారు.

ప్రజావాణికి 125 దరఖాస్తులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్, అధికారులు

అనంతగిరి: ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 125 మంది సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ శ్రీనివాస్, ఆర్‌డీఓ వాసుచంద్ర, డీపీఓ జయసుధ, ఏఓ ఫరీన ఖాతుమ్, డిప్యూటీ తహసీల్దార్ దీపక్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి: బీజేపీ



రాజేందర్‌గౌడ్

ధారూరు: కలెక్టర్, జిల్లా అధికారులపై రైతులు దాడికి పాల్పడటానికి ప్రభుత్వమే కారణమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మారుమూల గ్రామాల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటు తప్పుడు నిర్ణయమని తెలిపారు. అధికారులకు రక్షణ కల్పించకుండా ప్రజాభిప్రాయ సేకరణకు పంపడం సరికాదన్నారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా పనిచేసే ఏ ప్రభుమైనా గంగలో కలిసిపోవడం ఖాయమన్నారు. ఇచ్చిన హామీలను పక్కనబెట్టి నిరుపేదల నాశనం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం.. పెద్దల బాగుకోసం పనిచేస్తోందని విమర్శించారు.

పెద్ద జాతర ప్రారంభం



అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని అనంత పద్మనాభ స్వామి ఆలయంలో కార్తీక మాస పెద్ద జాతర సోమవారం ప్రారంభమైంది. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ పద్మనాభం, ఈవో నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులపై దాడికి పాల్పడుతున్న రైతులు

నిఘా వైఫల్యం

- ఆది నుంచీ ఫార్మా ఏర్పాటును వ్యతిరేకిస్తున్న రైతులు
- నిరసనలు, ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- అతివిశ్వాసంతో గ్రామంలోకి అధికారులు
- ఆగ్రహంతో ఉన్న వారికి ఆజ్యం పోసిన ప్రజాభిప్రాయసేకరణ

వికారాబాద్: ప్రజాగ్రహాన్ని అంచనా వేయడంలో నిఘా వ్యవస్థల వైఫల్యం కారణంగా జిల్లా అధికారులు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. దీనికి తోడు వారి అతివిశ్వాసం కూడా దాడికి కారణమైంది.. సీఎం ఇలాఖా దుద్యాల్ మండలం లగచర్ల గ్రామంలో సోమవారం కలెక్టర్ సహా అధికారులపై జరిగిన దాడి ఘటన వెనుక నిఘా వ్యవస్థల తప్పిదాలు కనిపిస్తున్నాయి. పోలీసులకు ముందుచూపు కొరవటం కొట్టొచ్చినట్లు కనిపించింది. 200 మంది పోలీసులను మోహరించినా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సహా ఉన్నతాధికారులపై జరిగిన దాడిని నిలువరించలేకపోయారు. వందల సంఖ్యలో గ్రామస్తులు, రైతులు అధికారులను రాళ్లు, కర్రలతో తరుముతుంటే ఘటనా స్థలంలో ఒకరిద్దరు పోలీసులు, గన్‌మెన్లు తప్ప ఎవరూ లేకపోవటం నిఘా వైఫల్యాన్ని ఎత్తి చూపింది. ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఊరి బయట టెంటు వేశారు. అక్కడ ఉన్న జిల్లా అధికారులను మాట్లాడదామని గ్రామంలోకి పిలిచి.. వచ్చి రాగానే దాడికి పాల్పడ్డారు. రెండు మూడు నెలలుగా ఫార్మా చిచ్చు రావణ కాష్టంలా రగులుతూ ఉంది.. ఇది వరకే పరిస్థితి లాఠీ చార్జి వరకు వెళ్లింది.. ఇంత జరుగుతున్నా ముందుస్తు వ్యూహం లేకుండా అధికారులు గ్రామంలోకి వెళ్లడం పెద్ద సాహసమే అని చెప్పవచ్చు.. పోలీసులెవరు అధికారుల వెంట లేకపోవడం దాడికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. తక్కువ భూకమతాలు కలిగిన ఎక్కువ మంది రైతులు ఫార్మా బాధితులుగా ఉండటం.. ఎకరం రెండెకరాలు తప్ప ఆ రైతులకు ఇంకే ఆధారం లేకపోవటంతో చావో రేవో తేల్చుకుందాం అనే స్థాయికి వచ్చారు.

పోలీసులు సేఫ్..!

లగచర్ల ఘటనలో పోలీసులు మినహా అందరూ రైతుల చేతిలో దాడికి గురైనవారే. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, వారి గన్‌మెన్లు, సీసీలు, ఇతర రెవెన్యూ యంత్రాంగంపై దాడి జరిగింది. పోలీసులు మాత్రం సేఫ్ సైడ్‌గా ఉండిపోయారు. ఇటీవల ఫార్మాసిటీ భూ సేకరణ కోసం అధికారులు గ్రామానికి వెళ్లిన సమయంలో స్థానికులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఇది లాఠీ చార్జి వరకు దారి తీసింది. పరిస్థితి ఇంత సీరియస్‌గా ఉందని తెలిసి కూడా పోలీసులు అధికారులను రక్షణ కల్పించడంలో విఫలమయ్యారు. గ్రామం వెలుపల రైతులతో మాట్లాడేందుకు వేసిన టెంటు వద్ద 200 మంది పోలీసులు ఉన్నా.. వారు అధికారులను వెంట గ్రామంలోకి వెళ్లలేదు. రైతుల ఆగ్రహాన్ని అంచనా వేయలేకపోయారు. దాడి అనంతరం వందల సంఖ్యలో పోలీసులు గ్రామానికి వెళ్లి పికెటింగ్ ఏర్పాటు చేశారు. అయితే దాడి సమయంలో కలెక్టర్ సహా ఇతర అధికారులు, గన్‌మెన్లు సంయమనం పాటించటం కూడా ప్రాణ నష్టం జరగకుండా కాపాడిందనే చెప్పవచ్చు.

జిల్లా వ్యాప్తంగా నిరసనలు

కలెక్టర్ సహా ఇతర అధికారులపై జరిగిన దాడిని ఖండిస్తూ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. విధులను బహిష్కరించి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాలు మూతపడ్డాయి. అడిషనల్ కలెక్టర్ సుధీర్, వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర, డీపీఓ జయసుధ, డీఆర్డీఓ శ్రీనివాస్ తదితర జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. దాడిని ముక్త కంఠంతో ఖండించారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కొందరు ముందస్తు ప్రణాళిక ప్రకారమే దాడికి పాల్పడ్డారని అధికారులు ఆరోపించారు.

జనాగ్రహం

ఇటీవలి ఘటనలతోనూ అప్రమత్తం కాని జిల్లా యంత్రాంగం



దాడిని ఖండిస్తూ కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల నిరసన

భయం గుప్పిట్లో లగచర్ల

కొడంగల్: దుద్యాల్ మండలం లగచర్ల గ్రామం భయం గుప్పిట్లో కాలం గడుపుతోంది. అధికారులపై సోమవారం దాడికి పాల్పడిన యువకులు గ్రామం వదిలి పారి పోయినట్లు సమాచారం. పోలీసులు ఎప్పుడు వచ్చి తీసుకెళ్తారోనని ఏ కేసులు పెడతారోనని బిక్కు బిక్కు మంటూ సురక్షిత ప్రాంతాలకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లా పోలీస్ యంత్రాంగం పారా మిలటరీ దళాలు లగచర్ల గ్రామంలో మోహరించి నిఘా పెంచాయి. గతంలో కొందరు ఫార్మా బాధిత రైతులు రాజకీయ నాయకులపై దాడికి యత్నించారు. అప్పట్లో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఎస్పీ నారాయణరెడ్డిలు రైతులను శాంతపరిచారు. కేసులు కాకుండా చూశారు. ఇప్పుడు ఏకంగా ఫార్మా బాధిత రైతులు జిల్లా అధికారులపై దాడికి యత్నించారు. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ విషయంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. చివరకు ఈ అంశం ఎక్కడి వరకు దారి తీస్తుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ప్రాణసంకటం



కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిపై దాడి చేస్తున్న గ్రామస్తులు

- రణరంగంగా మారిన గ్రామసభ
- ప్రాణాల మీదకు తెస్తున్న ఫార్మాసిటీ భూ సేకరణ

కొడంగల్/దుద్యాల్: దుద్యాల్ మండలంలో ఫార్మాసిటీ భూ సేకరణ అధికారులకు తలకు మించిన భారంగా మారింది. నిజంగా చెప్పాలంటే ప్రాణాల మీదకు వచ్చిందనే అనాలి. సోమవారం లగచెర్లలో భూ సేకరణ కోసం నిర్వహించిన గ్రామసభ రణరంగాన్ని తలపించింది. రైతులు దాడికి దిగడంతో అధికారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారు. దుద్యాల్ మండలం లగచెర్ల, హకీంపేట్, పోలేపల్లి, పులిచెర్లకుంట తండా, రోటిబండ తండాల పరిధిలో ప్రభుత్వం ఫార్మా కంపెనీ ఏర్పాటుకు సిద్ధమైంది. కొంత కాలంగా భూములు కోల్పోయే రైతులు ఫార్మాకు వ్యతిరేకంగా ఆందోళనలు, ధర్నాలు చేస్తున్నారు. కొందరు మాత్రం ఫార్మా ఏర్పాటుకు సమ్మతించారు. అధికారులకు అంగీకార పత్రాలు కూడా అందజేశారు. రైతులను ఒప్పించేందుకు అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే గతంలో పోలేపల్లిలో ప్రజాభిప్రాయ సభను నిర్వహించారు. ఫార్మా ఏర్పాటుకు కొంత మంది రైతులు అంగీకారం తెలపడా మరికొందరు నిరాకరించారు. అధికారులు రైతుల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. ఇది జరిగిన కొంత కాలానికి లగచెర్ల గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో కారులో వెళుతున్న కాంగ్రెస్ పార్టీ దుద్యాల్ మండల అధ్యక్షుడిపై తండా వాసులు దాడి చేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఆగిపోయింది. సోమవారం గ్రామంలో మరోసారి ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామసభ ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న లగచెర్ల, రోటిబండ తండా, హకీంపేట్ గ్రామాలకు చెందిన ఫార్మా బాధితులు లగచెర్ల ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు చేరుకొని గో బ్యాక్ ఫార్మా అంటూ నినాదాలు చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి గ్రామ సభ వద్దకు చేరుకున్నారు. అధికారులు కారు దిగుతుండగానే బాధిత రైతులు ఒక్కసారిగా దాడికి దిగారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, తాండూరు సబ్ కలెక్టర్ తప్పించుకోగా కడా అధికారి వెంకట్‌రెడ్డిని రైతులు పట్టుకుని కర్రలతో, రాళ్లతో దాడి చేశారు. కాపాడేందుకు యత్నించిన వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిపై కూడా దాడి చేశారు. పరిస్థితి చేయిదాటిపోవడంతో కడా అధికారి వెంకట్‌రెడ్డి పోలాల వెంట పరుగులు తీస్తూ ప్రాణాలు దక్కించుకున్నారు. ఘటన స్థలానికి పోలీసులు ఆలస్యంగా రావడంతో దాడి జరింది. దాడికి పాల్పడిన వారు గ్రామం నుంచి పారిపోయారు. పొలంలో ఉన్న కడా అధికారి వెంకట్‌రెడ్డిని ప్రత్యేక బలగాల రక్షణలో కొడంగల్‌కు తరలించారు. అనంతరం లగచెర్లలో భారీ స్థాయిలో పోలీసు బలగాలను మోహరించారు. 15 నిమిషాల లోపు ఇదంతా జరిగిపోయింది.

జరిగిందిలా..

- సోమవారం ఫార్మా భూ సేకరణకు కదిలిన జిల్లా యంత్రాంగం
- లగచెర్లలో గ్రామసభ ఉదయం 9గంటలకు గ్రామానికి చేరుకున్న రెవెన్యూ అధికారులు
- 200మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు
- 10.00 గంటలకు తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ రాక
- 12.00 గంటలకు కలెక్టర్, అదనపు కలెక్టర్ గ్రామసభ వద్దకు..
- 12.20 గంటలకు ఫార్మా భూ బాధితులతో మాట్లాడిన కలెక్టర్ ప్రతీక్‌జైన్
- 12.23 గంటలకు సమావేశం నుంచి లగచెర్ల గ్రామానికి..
- 12.30 గంటలకు లగచెర్లకు చేరుకున్న అధికారులు
- నిమిషం వ్యవధిలోనే దాడికి పాల్పడిన గ్రామస్తులు
- 15 నిమిషాల్లోనే రణరంగంగా గ్రామ సభ
- 30 నిమిషాల్లో తప్పించుకొని వెళ్లిన అధికారులు
- తర్వాత ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు
- గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు



దుద్యాల్ మండలం లగచర్లలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెటింగ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

నాణ్యమైన విద్యకు పెద్దపీట

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

అనంతగిరి: చదువుకునే క్రమంలో నిత్య విద్యార్థిగానే విద్యనభ్యసించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని వికారాబాద్‌లోని మైనార్టీ గురుకుల కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి, విద్యకు పెద్దపేట వేస్తోందన్నారు. విద్యార్థులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక దృక్పథం ఉండాలన్నారు. అనంతరం కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ మహబూబ్ ఫాతిమా, మైనార్టీ నాయకులు మహ్మద్ హఫీజ్, ఏజాజ్ ఆరిఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్ రూరల్: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం మండలంలోని పర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళారులను నమ్మి మోసపోసపోరాదని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, డీసీఓ నాగలింగాచారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రామకృష్ణ, సంఘం అధ్యక్షుడు శివకుమార్ గుప్తా, ఏఎంసీ అధ్యక్షుడు అంబయ్యగౌడ్, తహసీల్దార్ విజయకుమార్, ఏఓ లావణ్య, పీఏసీఎస్ డైరెక్టర్ నారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ శంకర్ నాయక్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో దాడులు సరికాదు

అధికారులపై దాడిని తప్పుబట్టిన ప్రజాసంఘాలు

- నిందితులను కఠినంగా శిక్షించాలని ఉద్యోగుల డిమాండ్

అనంతగిరి: కలెక్టర్, ఇతర అధికారులపై దాడిని వ్యతిరేకిస్తూ సోమవారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి కానీ భౌతిక దాడులు చేసి ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు.

హేయమైన చర్య

కలెక్టర్, ఇతర అధికారుల పట్ల జరిగిన ఘటన హేయమైన చర్య అని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్కడికి వెళ్లిన కలెక్టర్ పట్ల వ్యవహరించిన తీరును తప్పుబట్టారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

శాంతియుత పద్ధతిలో నిరసన తెలిపాలి

జిల్లా అధికారులపై జరిగిన దాడి మంచి పద్ధతి కాదని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు పోతురాజు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వానికి వారధిలా ఉన్న కలెక్టర్ పట్ల వ్యవహరించిన తీరు మంచిది కాదన్నారు. ఇష్టం లేకుంటే శాంతియుత పద్ధతిలో నిరసన తెలిపాలన్నారు. అంతేకాని భౌతిక దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు.

శాంతియుతంగా చేయాలి

లగచెర్ల ఘటనను పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ ఖండించారు. ఇలాంటి ఘటన మంచి పద్ధతి కాదన్నారు. శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలే తప్పా అధికారులపై దాడులు, వారి వాహనాలను ధ్వంసం చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం సరైనది కాదన్నారు.



వికారాబాద్‌లోని జెడ్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మంచి పరిణామం కాదు

లగిచెర్లలో కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన ఘటనను సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మాషిటీ ఏర్పాటను వద్దనే హక్కు గ్రామస్తులకు ఉంటుందని, కానీ ప్రజాభిప్రాయంలో నిర్ణయాన్ని శాంతియుత పద్ధతిలో చెప్పాలి. అంతేకాని ఇలాంటి ఘటనలకు పాల్పడటం మంచి పరిణామం కాదన్నారు. ఏమైన సమస్య ఉంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేయాలని సూచించారు. దాడికి పాల్పడటం ద్వారా సమస్య పరిష్కారం కాదన్నారు.

క్లుప్తంగా

26న 'చలో హైదరాబాద్'

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

అనంతగిరి: ఆసరా పెన్షన్ల పెంపునకు ఈనెల 26న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య వెల్లడించారు. సోమవారం వికారాబాద్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలల దాటినా నేటికీ ఇచ్చిన హామీ నెరవేర్చలేపోతున్నారన్నారు. పక్క రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి పెన్షన్‌లు పెంచాలన్నారు. లేదంటే ఈనెల 26న హైదరాబాద్‌ను ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జర్నమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి భూ సర్వే



అల్మాస్‌ఖాన్‌పేట్ రెవెన్యూ గ్రామంలో భూ సర్వే చేస్తున్న అధికారులు

కుల్కచర్ల: క్షేత్రస్థాయిలో 50 ఏళ్లకు పైగా భూమిని సాగుచేస్తూ భూపట్టా పొందని రైతులకు న్యాయం చేయాలనే తలంపుతో కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాలతో అల్మాస్‌ఖాన్‌పేట్ రెవెన్యూ గ్రామంలో సోమవారం అధికారులు భూ సర్వే నిర్వహించారు. సర్వే అధికారులు ప్రతీ రైతు పొలం వద్దకు వెళ్లి వారి వద్దనున్న రెవెన్యూ సంబంధిత ధృవపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్ మాట్లాడుతూ.. సాగు చేస్తున్న రైతుల పొలాల దగ్గరకు వారు ధృవపత్రాలను పరిశీలించామన్నారు. ఎన్నేళ్లుగా సాగులో ఉన్నారో సర్వేలో తెలుసుకుంటున్నామని చెప్పారు. భూ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

పెద్దేముల్: అనమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ గిరి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి వాగు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు దాడులు చేపట్టారు. ఇసుక తరలిస్తున్న గోపాల్ నాయక్, మెగావత్ రమేశ్‌ను స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్స పొందుతూ ఉపాధ్యాయురాలి మృతి



సవిత (ఫైల్)

యాలాల: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ ఉపాధ్యాయురాలు చికిత్స పొందుతూ మృతి చెందారు. మండల పరిధిలోని బెన్నూరు ఉన్నత పాఠశాలలో దూది సవిత(47) స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ బోధిస్తున్నారు. అనారోగ్యం కారణంగా ఆమె 20 రోజులుగా పాఠశాలకు సెలవు పెట్టి చికిత్స తీసుకుంటోంది. ఈ క్రమంలో పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందారు. సవిత భర్త శివప్రసాద్ పెద్దేముల్ మండలం కందనెల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయుడు. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నారు. సోమవారం సాయంత్రం తాండూరు పట్టణంలో సవిత అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె అకాల మరణం ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని పీఆర్‌టీయూ యాలాల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, రాములు అన్నారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

రూ.1.50లక్షల ఆస్తినష్టం



కాలిపోయిన సామగ్రి

కుల్కచర్ల: ప్రమాదవశాత్తు ఓ ఫీల్డ్ అసిస్టెంట్ ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు గౌడ్ ఇంటి నుంచి సోమవారం మధ్యాహ్నం పొగలు వెలుడుతున్నాయి. గమనించిన స్థానికులు మంటలార్పేందుకు యత్నించగా అప్పటికే ఇంటి లోపలి భాగం పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో సుమారు రూ.1.50లక్షల నష్ట వాటిల్లిందని బాధితులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించవచ్చునని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు

డీఆర్డీఓ డీపీఎం రామ్మూర్తి

కుల్కచర్ల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డీఆర్డీఓ డీపీఎం రామ్మూర్తి అన్నారు. సోమవారం మండల పరిధిలోని సాల్వీడు గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్వాహకులు రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య సీసీ వెంకటనర్సింలు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

దోమ: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ సర్పంచ్ వెంకటనర్సమ్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఖమ్మంనాచారం గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు యాదయ్య, శ్రీశైలం, నర్సింహులు, బుచ్చిలింగం, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్: చిలుముల మైల్వార్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకట్‌రెడ్డి తదితరులు

మద్దతు ధర పొందాలి

దుద్యాల్: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఏఎంసీ చైర్మన్ వెంకట్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింలు, మాజీ సర్పంచ్ రఘుపతి, ఏఈఓ జ్యోతి అన్నారు. సోమవారం వారు పీఏపీఎస్ ఆధ్వర్యంలో కుదురుమల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింలు, జనార్ధన్ గౌడ్, యాదవరెడ్డి, మోహన్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి
- అట్టహాసంగా జోనల్ స్థాయి పోటీలు ప్రారంభం

అనంతగిరి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన 10వ జోనల్ స్థాయి అండర్-14,17,19 బాలుర క్రీడాపోటీలను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులతో కలిసి ప్రారంభించారు. శివారెడ్డిపేట(అనంతగిరిపల్లి) సాంఘిక సంక్షేమ గురుకుల బాలల పాఠశాల, కళాశాలల ఆవరణలో నిర్వహించిన ఈ పోటీల్లో ముందుగా విద్యార్థులు మార్చ్‌ఫస్ట్‌తో స్వాగతం పలికారు. అనంతరం పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ఉత్తమ శిక్షణ అందించాలని సూచించారు. అనంతరం ప్రజాప్రతినిధులతో కలిసి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 పాఠశాలల నుంచి 971 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ గురుకుల బాలల పాఠశాల/కళాశాల విద్యా సంస్థల జోనల్ ఆఫీసర్ నిర్మల, ఆర్డీఓ వాసు చంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల సాంఘిక సంక్షేమ గురుకుల బాలల పాఠశాల/కళాశాల విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పట్నం మహేందర్‌రెడ్డి, కాలె యాదయ్య

సర్వే పరిశీలన

వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని బీటీఎస్ కాలనీలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మండలి చీఫ్ విప్ ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సర్వే కు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

ధర తగ్గిన వేలం!

- రెండేళ్ల క్రితం రూ.2.50లక్షలు నేడు రూ.1.32లక్షలకే పరిమితం
- ప్రత్యేక అధికారి సమావేశం నిర్వహించినా ఫలితం శూన్యం

ధారూరు: ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు వచ్చే వాహనాల పార్కింగ్ కోసం మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు పంచాయతీలో సోమవారం రెండుసార్లు వేలం నిర్వహించారు. ఈ వేలం రూ.1.32 లక్షలకే ముగిసింది. ఆరు రోజుల పాటు కొనసాగే ఈ జాతరకు లక్షలాదిగా వాహనాలు వస్తుంటాయి. మంగళ, బుధవారాల్లో వాహనాల సంఖ్య తగ్గినా గురు, శుక్ర, శని, ఆదివారాలు రోజుకు 10 వేల వరకు వస్తుంటాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు. రెండేళ్ల క్రితం రూ.2.50లక్షల వరకు పెరిగిన వేలం నాయకులు సిండికేట్‌గా మారడంతో నామమాత్రంగా పాడి తక్కువ ధరకు దక్కించుకున్నాటున్నారు. గతేడాది రూ.లక్షకు తీసుకున్న ఓ నేత జాతర తర్వాత డబ్బులు పంచాయతీలో చెల్లించకుండా మొండికేశారు. ఈ వేలంలో ఆయనకు అవకాశం ఇవ్వలేదు. సోమవారం నిర్వహించిన వేలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు వేలానికి వచ్చిన వారితో మాట్లాడి సిండికేట్‌గా మారారు. ఉదయం నిర్వహించిన వేలం రూ.1.06లక్షలకు పరితమైంది. దీంతో కార్యదర్శి అంచనా డబ్బు రాలేదని వాయిదా వేశారు. డీఎల్‌పీఓ అనుమతితో రెండో సారి వేలం నిర్వహించగా ఆ నాయకుకే రూ.1.32లక్షలకు వేలం దక్కించుకున్నాడు. గ్రామ పంచాయతీ వారు ఆరు చక్రాల వాహనానికి రూ.200 చొప్పున, త్రీ, ఫోర్ వీలర్స్‌కు రూ.100 చొప్పున, బైక్‌లకు రూ.50 చొప్పున ధర నిర్ణయించారు. ఈ లెక్కన ఆరు రోజుల్లో రూ.10లక్షల వరకు పార్కింగ్ ఫీజు రూపంలో వచ్చే అవకాశం ఉన్నా.. తక్కువ ధరకు వేలం దక్కించుకోవడంతో గ్రామస్తుల నుంచి విమర్శలు వస్తున్నాయి. మండల స్థాయి అధికారులు సైతం మౌనం వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జీపీ ప్రత్యేక అధికారి చంద్రశేఖర్‌తో పాటు ఎంపీడీఓ, ఎంపీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించినా లాభం లేకపోయిందని గ్రామస్తులు పెదవి విరిచారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి చంద్రశేఖర్

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

శంకర్‌పల్లి: చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రాకరం.. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం చక్రంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య, యాదమ్మ దంపతులు కొన్నేళ్ల క్రితం బతుకుదెరువుకోసం కొడుతో కలిసి శంకర్‌పల్లికి వచ్చారు. శ్రీరాం నగర్ కాలనీలో ఉంటున్న క్రమంలో అనారోగ్యంతో లక్ష్మయ్య మృతి చెందాడు. యాదమ్మ తన కుమారుడు శ్రీకాంత్(22)తో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 7న రాత్రి బిల్డింగ్‌పై ఫోన్ మాట్లాడుతున్న శ్రీకాంత్ ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. దీంతో ఆయన్ను చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం మృతి చెందాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లి శోకసంద్రంలో మునిగింది.

బైక్ ప్రమాదంలో..

దోమ: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ తెలిపిన ప్రకారం.. గండీడ్ మండలంలోని వెన్నచెడ్ గ్రామానికి చెందిన పెద్ద మలక్కయ్య(62) శుభకార్యానికి వెళ్లివస్తూ గాయపడిన విషయం పాఠకులకు విదితమే. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు మల్కయ్య సోమవారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు గడ్డమీది చిన్న మల్కయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆనంద్ కుమార్ తెలిపారు.

టీఏసీ మెంబర్‌గా సతీశ్



నియామకపత్రం అందుకుంటున్న సతీశ్

అనంతగిరి: బీఎస్ఎన్ఎల్ టెలికాం అడ్వయిజ్ కమిటీ మెంబర్‌గా(హైదరాబాద్ బిజినెస్ ఏరియా) వికారాబాద్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు పోకల సతీశ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి సతీశ్‌కు నియామకపత్రం అందజేశఋరు. తనపై నమ్మకంతో నామినేట్ చేసిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

13న డెడికేటెడ్ కమిషన్ బహిరంగ విచారణ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ ఈనెల 13న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బహిరంగ విచారణను నిర్వహిస్తుందని డెడికేటెడ్ కమిషన్ కార్యదర్శి బడుగు సైదులు ఐఎఫ్ఎస్ సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాంగాన్ని అనుసరించి, సుప్రీంకోర్టు తీర్పు మేరకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల నిర్ధారణ కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాలో పర్యటించి స్థానిక ప్రజల అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. బుధవారం నిర్వహించే ఈ విచారణలో రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లా ప్రజలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ తమ అభిప్రాయాలను కమిషన్కు తెలియజేయాలని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బంగారు ఆభరణాలు అపహరణ

యాచారం: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన యాచారం ఠాణా పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని నస్దిక్‌సింగారం గ్రామానికి చెందిన కదారి వెంకటయ్య కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రాత్రి కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వెళ్లారు. ఇది గమనించిన గుర్తు తెలియని దుండగులు తాళం పగుల గొట్టి ఇంట్లోని రూ.2లక్షల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చిన బాధితులు తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

నెల రోజుల్లో రెండు సర్కారు కొలువులు

శంకర్‌పల్లి: నెల రోజుల వ్యవధిలోనే మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ నగర్‌కి చెందిన కిరణ్ కుమార్ అనే యువకుడు రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై .. అబ్బురపరిచాడు. అక్టోబర్‌లో మేడ్చల్ జిల్లాలో గ్రౌండ్ వాటర్ విభాగంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు తీసుకోగా.. సోమవారం అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా హైదరాబాద్‌లో నియామక పత్రం అందుకున్నాడు. కొడుకు రెండు ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల తల్లిదండ్రులు బాలయ్య, విజయలలిత ఆనందాన్ని వ్యక్తం చేశారు.



రవాణా శాఖ అధికారుల చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న కిరణ్‌కుమార్

సందడిగా సదర్

షాద్‌నగర్‌రూరల్: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో సదర్ ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. పట్టణంలోని వివిధ కాలనీల నుండి దున్నపోతులతో యాదవ సంఘాల నాయకులు ర్యాలీగా పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు ర్యాలీగా వచ్చారు.

బహుమతుల ప్రదానోత్సవంలో గలాటా

సదర్ వేడుకల్లో ఇద్దరు యువకుల మధ్య జరిగిన గొడవ గలాటాకు దారితీసింది. ఉత్సావాల సందర్భంగా మెయిన్‌రోడ్డులో ఓ వేదిక ఏర్పాటు చేసి బహుమతులు అందజేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాల వారికి నిర్వాహకులు నచ్చజెప్పేందుకు యత్నించినా వినకపోవడంతో గొడవకు దారితీసింది. దీంతో పోలీసులు రంగం ప్రవేశం చేసి వారిని చెదరగొట్టేందుకు యత్నించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత దంగు శ్రీనివాస్ యాదవ్‌తో పాటుగా పలువుకు యాదవ సంఘం నాయకులకు స్వల్ప గాయాలయ్యాయి.

ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తం

రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం పంపిణీ చేసే సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారుతోంది. తొమ్మిది రకాల సరుకులకు గాను కేవలం బియ్యం పంపిణీ చేసి చేతులు దులుపుకొంటున్నారు.

రేషన్ పంపిణీలో భారీగా కోత

- బియ్యం మాత్రమే పంపిణీ
- ఇబ్బంది పడుతున్న పేదలు



కొత్తూరు: పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసర సరుకులను తక్కువ ధరకే అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటైన ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యమవుతోంది. దీంతో గ్రామాల్లో రేషన్ దుకాణాలు అలంకారప్రాయంగా మారుతున్నాయి. గతంలో రేషన్ షాపుల్లో పప్పులు, బియ్యం, కిరోసిన్‌తో పాటు తొమ్మిది రకాల సరుకులను సరఫరా చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వాలు మారినప్పుడల్లా వారికి అనుగుణంగా మార్పులు తీసుకువస్తుండడంతో సరుకుల పంపిణీ కార్యక్రమం అస్తవ్యస్తంగా మారుతోంది. ఆహారభద్రతకార్డు దారులకు ఏడాది నుంచి బియ్యం మాత్రమే పంపిణీ చేస్తూ పంచదారను నిలిపి వేశారు. దీంతో వారు నిత్యావసర సరుకులను మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

స్టాక్ లేదని సరఫరా బంద్

మండల పరిధిలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా 13 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇందులో అంత్యోదయ కార్డులు 544, ఆహారభద్రత కార్డులు 7,619 ఉన్నాయి. ప్రస్తుతం వీరికి ప్రతీ నెల రేషన్ షాపు నుంచి 1,73,582 కిలోల బియ్యం సరఫరా చేస్తున్నారు. రెండేళ్ల క్రితం మండలంలో ప్రజా పంపిణీ దుకాణాల ద్వార నెలకు 7,940 లీటర్ల కిరోసిన్, 543 కిలోల పంచదారను పంపిణీ చేయగా ప్రస్తుతం స్టాక్ లేదంటూ సరఫరా నిలిపివేశారు. గతంలో కేవలం అంత్యోదయ కార్డుదారులకు మాత్రమే పంచదార అందించారు. కిరోసిన్ సైతం కార్డులకు అనుగుణంగా రాకపోవడంతో వచ్చిన స్టాకులోనే అందరికి పంపిణీ చేశారు. ఆహారభద్రతకార్డు దారులకు కుటుంబంలో ఒక్కొక్కరికి ఆరు కిలోల బియ్యం, అంత్యోదయ కార్డులో మాత్రం ఎంత మంది సభ్యులున్నా 35 కిలోల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.

కూలీరేట్లు పెరగక ఇబ్బందులు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా రేషన్ దుకాణాల్లోనే నిత్యావసర సరుకులను తీసుకుంటున్నారు. మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నా మరింత నిర్వీర్యం అవుతున్నాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెరగక పోవడంతో మూడు పూటలా తిండి తినేందుకు సైతం ఇబ్బంది పడాల్సి వస్తోంది.

ఆందోళనలో డీలర్లు

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ఎక్కువ సరుకులు పంపిణీ చేసినప్పుడు డీలర్లకు సరిపడా కమీషన్ వచ్చేది. ఇప్పుడు కేవలం బియ్యంతో సరిపెట్టడంతో పరిస్థితి తలకిందులైంది. తక్కువ కార్డులున్న డీలర్లకు నెలకు తక్కువ కమీషన్ వస్తుండడంతో వారు ఆర్థిక భద్రతతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే వారు తమ డిమాండ్లు, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళనల బాట పట్టారు.

తేలికపాటి నేలలే అనుకూలం



పత్తిసాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పత్తి సాగుపై రైతులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు

పెద్దేముల్: పత్తి సాగుకు తేలికపాటి నేలలే అనుకూలమని ప్రధాన శాస్త్రవేత, తాండూరు వ్యవసాయ స్థానం అధిపతి డాక్టర్ సుధారాణి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఇందూరు రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానం తాండూరు ఆధ్వర్యంలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్ వారి ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తి ఆవశ్యకతను రైతులకు వివరించారు. పత్తి సాగులో కూలీల కొరత తీవ్రంగా ఉందన్నారు. అధిక సాంద్రతలో యాంత్రీకరణతో పత్తి సాగు విత్తుకోవచ్చన్నారు. ఈ పద్ధతిలో విత్తనాలు సరైన లోతులో విత్తడం వలన మొలక మంచిగా వస్తుందన్నారు. మొక్కల మధ్య దూరం, కలుపు యాజమాన్యం, పెరుగుదల నియంత్రణపై అవగాహన కల్పించారు. డాక్టర్ రాజేశ్వరెడ్డి అధిక సాంద్రతలో ఆశించే వేరుకుళ్ల తెగులు, ఆకుమచ్చ తెగుళ్ల లక్షణాలు, వాటి యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ టి.లక్ష్మన్ జనవరిలో రెండవ పంటగా పెసర, మినుము సాగుచేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త యమున, తాండూరు డివిజన్ ఏడీఏ రుద్రమూర్తి, పెద్దేముల్ ఏఓ కొమురయ్య, ఆర్‌ఏసీ సభ్యుడు నారాయణ, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరుడి శోభ

కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి దేవస్థానంలోని పరమశివుడు కొలనుపాక శ్రీసోమేశ్వర స్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారికి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

– తాండూరు టౌన్



కార్తీకమాస విశేష పూజలు

ధారూరు: కార్తీక మాసం సందర్భంగా మండలంలోని బాచారం గ్రామంలో రెండో సోమ వారం పార్వతి, పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు గణనాథునికి అభిషేకం చేశారు. అనంతరం అర్చకు లు చెన్నబసవయ్య సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దీపారాధన

మండల కేంద్రంలోని శ్రీవీరభద్రేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం రాత్రి మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. కార్తీక మాసం సందర్భంగా మహిళలంతా దేవాలయానికి చేరుకుని పార్వతీమాతకు కుంకుమార్చన నిర్వహించారు.



వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



మల్లేష్(ఫైల్)

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన ప్రకారం.. కడ్తాల్ మండలం గోవిందపల్లికి చెందిన కంబాలపల్లి మల్లేశ్(34) జిల్లా పరిధిలోని బాలాపూర్ మండలం, జిల్లెలగూడలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రి స్వగ్రామం నుంచి కారులో హైదరాబాద్ వైపు బయలుదేరాడు. మార్గమధ్యలో మండలంలోని కొత్తగూడ చౌరస్తా సమీపంలోని ఎంఎంఆర్ రెస్టారెంట్ శ్రీశైలం రహదారిపై ఎదురుగా అజాగ్రత్తగా, అతివేగంగా వస్తున్న బొలేరో వాహనం అతని కారును ఢీకొట్టింది. దీంతో మల్లేశ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సందడిగా సదర్

షాద్‌నగర్‌రూరల్: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో సదర్ ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. పట్టణంలోని వివిధ కాలనీల నుండి దున్నపోతులతో యాదవ సంఘాల నాయకులు ర్యాలీగా పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు ర్యాలీగా వచ్చారు.

బహుమతుల ప్రదానోత్సవంలో గలాటా

సదర్ వేడుకల్లో ఇద్దరు యువకుల మధ్య జరిగిన గొడవ గలాటాకు దారితీసింది. ఉత్సావాల సందర్భంగా మెయిన్‌రోడ్డులో ఓ వేదిక ఏర్పాటు చేసి బహుమతులు అందజేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాల వారికి నిర్వాహకులు నచ్చజెప్పేందుకు యత్నించినా వినకపోవడంతో గొడవకు దారితీసింది. దీంతో పోలీసులు రంగం ప్రవేశం చేసి వారిని చెదరగొట్టేందుకు యత్నించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత దంగు శ్రీనివాస్ యాదవ్‌తో పాటుగా పలువుకు యాదవ సంఘం నాయకులకు స్వల్ప గాయాలయ్యాయి.